క్లుప్తంగా

27న మండల సర్వసభ్య సమావేశం

కాజులూరు: కాజులూరులో ఈ నెల 27 శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఐ.రత్నరాజు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మండల గ్రామాలకు చెందిన గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు స్థానిక సంస్థల ప్రతినిధులు, అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తప్పని సరిగా పాల్గొనాలన్నారు.

రాష్ట్ర సదస్సుకు న్యాయవాదుల పయనం



రాష్ట్ర సదస్సుకు రామచంద్రపురం నుంచి వెళ్లిన న్యాయవాదులు

రామచంద్రపురం: రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం హైకోర్టులో జరిగిన రాష్ట్ర స్థాయి న్యాయవాదుల సదస్సుకు రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు అమరావతికి బయలుదేరి వెళ్లారు. కోర్టుల్లోని అన్ని దరఖాస్తుల మీద రూ.20ల స్టాంపులు అంటించాలని బార్ కౌన్సిల్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా గత 15 రోజులుగా న్యాయవాదులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అధ్యక్షత కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షులు డీఎస్ఎస్‌శర్మ, పలివెల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ చిన్నం వీర్రెడ్డి జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీ, సీనియర్ న్యాయవాదులు కె.భరత్‌కుమార్, కేవీవీ సత్యనారాయణ, టి.చలపతి, నీలం మధుసూదనరావు, తదితర సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు తరలివెళ్లారు.

నిత్యాన్నదానానికి రూ.25వేల విరాళం



అంగరలో విరాళం రసీదును అందుకుంటున్న నామాల శ్రీనివాస్

కపిలేశ్వరపురం: అంగరలోని అలివేలుమంగ, గోదాదేవీ సమేత వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాశ్వత అన్నదాన కార్యక్రమం నిమిత్తం ఆలమూరు మండలం చింతలూరు గ్రామానికి చెందిన నామాల రామచంద్రరావు, లక్ష్మి దంపతుల కుమారుడు నామాల శ్రీనివాస్, శ్రీజ్యోతి దంపతులు రూ.25 వేలు విరాళాన్ని అందజేశారు. శ్రీనివాస్ ఆలయంలో పూజలు చేసి నిర్వాహకులు, అర్చకులకు విరాళం సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో శీలం గోవింద్, మోటిపల్లి బాబులు, సూరంపూడి వెంకట్రావు, పెద్దింశెట్టి రామస్వామి, వెల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

మండపేట: ప్రతిభావంతులైన క్రీడాకారులకు శ్రీవేగుళ్ల సూర్యారావు చారిటబుల్ ట్రస్టు ప్రోత్సాహం ఎల్లప్పుడు ఉంటుందని ట్రస్టు చైర్మన్ వేగుళ్ల చైతన్యబాబు, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి అన్నారు. ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన వరల్డ్ టెన్నికాయిట్ పోటీల్లో జాతీయ జట్టులో ప్రాతినిధ్యం వహించి గోల్డ్ మెడల్ సాధించిన మండపేట క్రీడాకారులు వద్దాది వినయ్‌కుమార్, పిల్లి రామారావులను శనివారం వారు ఘనంగా సత్కరించారు. రూ.10వేలు చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గతంలో వరల్డ్ టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనేందుకు సహకారం అందించడం పట్ల వినయ్, రామారావులకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కోచ్ కుంచే రమేష్ పాల్గొన్నారు.

లలితాత్రిపుర సుందరిగా జగన్మాత

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తులు




లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



మహా చండికాదేవిగా ఆదివారపుపేట పార్వతీ అమ్మవారు



మహా చండికాదేవిగా ఆదివారపుపేట పార్వతీ అమ్మవారు



లలితాత్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన విజయదుర్గా అమ్మవారు

రామచంద్రపురం రూరల్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాల్లో శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శనివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన, సువర్ణ పుష్పార్చన పూజలు జరిగాయి. మాణిక్యాంబా అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులను అలరించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో లలితా త్రిపుర సుందరీ దేవి అమ్మవారి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు దర్శనమిచ్చారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతి అమ్మవారు మహా చండికాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు బోండు బాల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు.

మాణిక్యాంబని దర్శించుకున్న సూర్యప్రకాశ్ దంపతులు

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు, వైఎస్సార్ సీపీ నేత పిల్లి సూర్యప్రకాశ్ దంపతులు శనివారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆశీర్వచనాలు అందజేశారు.

కాజులూరు: నవరాత్ర మహోత్సవాలు పురస్కరించుకుని గొల్లపాలెంలో కాజులూరు జంక్షన్‌లోని దుర్గాదేవి ఆలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేదపండితులు బాదంపూడి నాగవెంకటసుబ్రహ్మణ్యం (పండుస్వామి), సతీష్‌స్వామిల ఆధ్వర్యంలో పలువురు పురోహితులు గణపతిహోమం నిర్వహించి, నవదుర్గలకు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహంతో భవానీభక్తులు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి ఆలయం ఎదుట నిప్పుల గుండం ఏర్పాటు చేసి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అల్పాహారం వితరణ జరిపారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు ఆరు వందల మంది భవానీలు నిప్పుల గుండంపై నడిచి మొక్కులు తీర్చుకున్నారు.

రామచంద్రపురం రూరల్: అష్టాదశ శక్తి పీఠాల్లో 12వదిగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శనివారం శ్రీ లలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చా రు. అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణార్చన, సువర్ణ, రజత పుష్పార్చన నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు పర్యవేక్షించారు.

రాయవరం: వెదురుపాక విజయదుర్గ అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు చీమలకొండ వీరావధాని, చీమలకొండ శ్రీనివాస్, కోట లక్ష్మీనారాయణ, నాగేంద్రశర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత విజయవెంకటేశ్వర స్వామి వారికి సుప్రభాతసేవ, తులసిదళాలతో అర్చనలు, అభిషేకాలు జరిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు, అలాగే పీఠంలో గోపూజ నిర్వహించారు. గోమాతకు పూజాదికాలు చేసిన భక్తులు గోమాతను దర్శించుకున్నారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అసోసియేట్ మాజీ రీజనల్ కోఆర్డినేటర్ కందర్ప హనుమాన్ తదితరులు అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించిన అనంతరం పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) ఆశీస్సులు పొందారు. పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి) ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న మంత్రి వేణు



కొత్తూరు రోడ్డులోని కనకదుర్గమ్మను దర్శించుకున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పట్టణంలోని కొత్తూరు రోడ్డు జోడు తూముల వద్ద వేంచేసిన కనకదుర్గ అమ్మవారిని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శనివారం ఉదయం దర్శించుకున్నారు. దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా ఏడో రోజు నవదుర్గల్లో ఒకరిగా భాసిల్లే కాత్యాయని దేవి అవతారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. మంత్రి వేణు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మంత్రి వేణుకు ఆశీర్వచనాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కేశవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

మండపేట: ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అందుకోసం ఆయన ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు నేడు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి తదితరులతో కలిసి శనివారం సాయంత్రం కేశవరంలోని జగనన్న కాలనీ, దేవుడుతాళ్ల కాలనీలో ఎమ్మెల్సీ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. నాలుగున్నర సంవత్సరాల పాలనలో ప్రభుత్వం ద్వారా వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. జగనన్న కాలనీలో వీధిలైట్లు, తాగునీటికి సంబంధించిన వసతులు కల్పించాలని కోరగా గేటెడ్ కమ్యూనిటీలకు ధీటుగా ప్రభుత్వం జగనన్న కాలనీలను అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్సీ తోట వివరించారు. స్థానికులు కోరిన ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఐ.రాజు, ఈఓ సుబ్బారావులకు సూచించారు. ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, పెదపాటి ఉమామహేశ్వరరావు, వార్డు సభ్యులు అల్లంపల్లి కిషోర్, మన్నే నారాయణమూర్తి, సమతం పాపారావు, జేసీఎస్ కన్వీనర్ బందెల సాయిరాం, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- మంత్రి చెల్లుబోయిన వేణు



కుడుపూరులో లబ్ధి చేకూరిన వివరాలతో కూడిన పత్రాలను అందిస్తున్న మంత్రి వేణు

కె.గంగవరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని కుడుపూరులో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల గురించి వివరించి పత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతి ఇంటికీ సంక్షేమ అందించాలనే ఉద్దేశంతో నవరత్నపథకాలు ప్రవేశపెట్టిందని దానిలో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా మధ్యవర్తిత్వం లేకుండా అందిస్తుందన్నారు. ప్రభుత్వం పేదలకు మంచి చేయాలని ఉద్దేశంతో పని చేస్తుంటే ప్రతి పక్ష పార్టీలు ఓర్వలేక అర్థం లేని వాదనలు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రానున్న కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు మేలు చేస్తా మని చెప్పారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పిల్లి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సత్తిబాబు, ఎంపీటీసీలు కొప్పిశెట్టి లక్ష్మణ్, పిల్లి దుర్గాప్రసాద్, మండల కోఆప్షన్ సభ్యురాలు కడలి విజయదుర్గ, పలు గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి



కె.గంగవరంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న డీఎస్పీ ప్రసాద్, ఎస్సై జానీబాషా

రామచంద్రపురం: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులకు రామచంద్రపురం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ వి.దుర్గారావు ఎస్సై డి.సురేష్‌బాబులు ఘనంగా నివాళులర్పించారు. పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను కొనియాడారు. అనంతరం ఆటో డ్రైవర్స్, మహిళా పోలీసులు, పోలీసు సిబ్బందితో కలసి ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ పోలీస్ విధుల గురించి, విధి నిర్వహణలో ప్రాణ త్యాగాలు చేసిన వారి గురించి వివరించి అమరులైన వారి కోసం కొద్దిసేపు మౌనం పాటించారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ప్రసాద్ అన్నారు. కె.గంగవరంలో శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్టేషన్ వద్ద అమరవీరులకు నివాళులర్పించి స్థానిక బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కె.గంగవరం ఎస్సై జానీ భాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బులిస్వామిరెడ్డి సేవలు ప్రశంసనీయం



రోగులకు మందులు అందజేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, బులిస్వామిరెడ్డి

మండపేట: పేదల ఆరోగ్య పరిరక్షణకు పదమూడున్నర సంవత్సరాలుగా ప్రతినెలా ఉచిత హోమియో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. అర్తమూరులోని ట్రస్టు గ్రంథాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన 164వ హోమియో వైద్య శిబిరాన్ని చైర్‌పర్సన్ దుర్గారాణి ప్రారంభించారు. ఈ శిబిరంలో 320 మంది రోగులకు రాజమహేంద్రవరంలోని అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల వైద్యులు సేవలు అందించారు. ట్రస్టు వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణరెడ్డి, సత్తి సత్యనారాయణరెడ్డి, కోనాల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకూ' విజయవంతం చేయాలి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

మండపేట: ఈనెల 25వ తేదీ నుంచి ద్వారపూడిలో మొదలయ్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. కార్యక్రమం నిర్వహణపై శనివారం ద్వారపూడిలో సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ, సొసైటీ చైర్మన్ తులా శ్రీరంగారావు, పార్టీ నేతలతో సమీక్షించారు. అదే రోజు ఉదయం గ్రామంలోని అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ఏర్పాట్లు చేసినట్టు నేతలు తెలిపారు. సాయంత్రం గడప గడపకూ కార్యక్రమం మొదలవుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న పాలనపై ప్రజలు ఎంతో సంతృప్తితో ఉన్నారన్నారు. మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, మండల సేవాదళ్ కన్వీనర్ పోతుల రాంబాబు, సంగిశెట్టి రమేష్, పార్టీ నాయకులు సత్తి సత్తిబాబు, పోలినాటి సత్యనారాయణ, పోతుల దుర్గాప్రసాద్, నామాల వెంకన్న, తొంటాపు సత్తిపండు, నామాల శ్రీనివాస్, మేకా మణి, దూలం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో అసత్యప్రచారం



మీడియాతో మాట్లాడుతున్న వెంకన్నబాబు, ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు

మండపేట: నియోజకవర్గంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు లభిస్తున్న జనాదరణ చూసి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు ఓటమి భయం పట్టుకుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ విమర్శించారు. ఎమ్మెల్సీ తోట నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని, కేశవరంలో రైల్వే ఫ్లైఓవర్‌కు నిధులు టీడీపీ హయాంలో మంజూరు చేయించామని ఎమ్మెల్యే వేగుళ్ల చెబుతున్న మాటలు వాస్తవ విరుద్ధమన్నారు. మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి మీ కళ్లకు కనిపించడం లేదాని వారు ప్రశ్నించారు. కేశవరం, ద్వారపూడి, జెడ్.మేడపాడు గ్రామాల్లో మీ వల్ల సాధ్యంకాని పుంత రోడ్లు అభివృద్ధిని ఎమ్మెల్సీ తోట చేసి చూపించి రైతు పక్షపాతిగా నిలిచారన్నారు. కేశవరం గ్రామాభివృద్ధికి ఎమ్మెల్సీ తోట చేస్తున్న కృషిని స్వయంగా టీడీపీ సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి రైతు సభ వేదికగా చెప్పిన మాటలు మీకు వినిపించలేదాని ప్రశ్నించారు. ఆయన మిమ్మల్ని వదిలిపెట్టి ఎమ్మెల్సీ తోటకు మద్దతుగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలోనే కేశవరానికి రైల్వే ఫ్లైఓవర్ మంజూరైన విషయాన్ని వారు గుర్తుచేశారు. గ్రామంలో జరిగిన అభివృద్ధిపై తాము బహిరంగ చర్చకు సిద్ధమని వెంకన్నబాబు, ఎంపీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఎంపీటీసీ సభ్యుడు చంద్రమళ్ల పోతురాజు, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందువుల చంద్రరావు, మన్నే నారాయణమూర్తి, సమతం పాపారావు, తుపాకుల ప్రసన్నకుమార్, సలాది శివన్నారాయణ, యడ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల అప్పగింత

రామచంద్రపురం రూరల్: వివిధ కారణాలతో ఇంటి స్థలం మంజూరై స్థలాలు అప్పగించని కొందరికి రామచంద్రపురం మండలం హసన్‌బాద లేఅవుట్‌లో శనివారం గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో స్థలాలను అప్పగించారు. సర్పంచ్ సతీష్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్లు కట్టించాలన్న గొప్ప ఆశయంతో లక్షలాది రూపాయల విలువైన స్థలాలు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణం చేసుకునేలా అండగా నిలుస్తున్న సీఎం జగన్‌కి, మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగేశ్వరరావు, వీఆర్‌ఓలు సాయిబాబు, సూర్యకుమారి, గోపీనాథ్, శ్రీరామకృష్ణ, రామకృష్ణ, గనిరాజు పాల్గొన్నారు.

బెట్టింగ్ ఆడుతున్న ఇద్దరి అరెస్ట్

రామచంద్రపురం: పట్టణంలోని ముచ్చుమిల్లిలో క్రికెట్ బెట్టింగ్ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు రామచంద్రపురం పట్టణ ఎస్సై డి.సురేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ టీఎస్ఆర్‌కే ప్రసాద్ పర్యవేక్షణలో సీఐ దుర్గారావు ఆధ్వర్యంలో పట్టణంలోని ముచ్చిమిల్లిలో ఒక రూమ్‌లో క్రికెట్ బెట్టింగ్ జరుగుతుందనే సమాచారంతో సిబ్బందితో కలిసి రైడ్ చేయగా చల్లా వెంకటరమణ, పైడి జయ సూర్యమణికంత అనే ఇద్దరు వ్యక్తులును అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద ఉన్న రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేసి, రూ.10 లక్షల 60 వేలను వారి అకౌంట్‌లో ఫ్రీజ్ చేశామని తెలిపారు. ఈ కేసులో మొబైల్ డేటా ఆధారంగా మరికొంత మంది వ్యక్తులను గుర్తించడం జరిగిందని వారు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

పేదల సంక్షేమమే సీఎం లక్ష్యం



సోమేశ్వరంలో గర్భిణులుకు నిర్వహిస్తున్న సీమంతాలు

కాజులూరు: రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. శనివారం మండలంలోని పల్లిపాలెం గ్రామ సచివాలయం-1 ఆవరణలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన డాక్టర్లు డి.శ్వేత, ఎం.అజయ్‌కుమార్, ఎస్.సౌజన్య, వై.సుప్రియ, జి.స్వాతి, మహ్మద్ తదితర నిపుణులైన వైద్యులు పాల్గొని కళ్లు, కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులు తదితర సమస్యలపై రోగులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సుప్రియ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో 551 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించామని వీరిలో ఇద్దరికి మెరుగైన వైద్యం అవసరం కావటంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు.

కె.గంగవరం: ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని కోట ప్రాథమిక పాఠశాల వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్దపీట వేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దకే అందించేందుకు ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం చేపట్టి పూర్తి స్థాయి వైద్యులను నియమించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచారన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ మల్లిడి కళ్యాణి, ఎంపీటీసీ మెండి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిడి వెంకట్రావు, అయితాబత్తుల సుబ్బారావు, శేషాద్రి, కూర్మా రాజు, మల్లిడి నాగేశ్వరరావు, వెంకన్న, జనిపెల్ల సుబ్రహ్మణ్యం కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండపేట: ఏడిదలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 436 మందికి వైద్యులు సేవలు అందించారు. 135 మందికి కంటి పరీక్షలు చేశారు. రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఆర్‌బీకే మండల డైరెక్టర్ చిలుకూరి బుజ్జి తదితరులు హాజరయ్యారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక శీమంతాలు నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాయవరం: సోమేశ్వరం సచివాలయం-2లో శనివారం సర్పంచ్ ఆరిఫ్ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ హాజరై మాట్లాడారు. నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు 545 మందికి సేవలు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.